ప్రజాశక్తి
మంగళవారం 21 జనవరి 2025 5
శ్రీ సత్యసాయి



యంగ్‌ఇండియా వ్యవస్థాపకుడు..

నరేంద్రసింగ్ బేడీ కన్నుమూత

నరేంద్ర సింగ్ బేడీ....

సంపన్న వర్గాల కుటుంబంలో జననం.. జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న యూనివర్సిటీలలో ఉన్నత చదువులు.. కష్టం అంటే ఏమిటో తెలియని జీవనంలో పెరిగిన వ్యక్తి నిరుపేదలు పడుతున్న కష్టాలను చూసి చలించారు. తాను చదివిన చదువు అణగారిన వర్గాల కోసం ఉపయోగపడాలన్న ఉన్నత లక్ష్యంతో అడుగు ముందుకేశారు. ప్రజలను చైతన్యం చేస్తూ ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారు. యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పేదల హక్కుల కోసం ముందుకు నడిచారు. తన జీవితాన్నీ.. ఆస్తిని ధారబోసి తుదిశ్వాశ వరకు మొక్కవోని దీక్షతో సమసమాజ స్థాపన కోసం అనునిత్యం పరితపించిన నరేంద్ర సింగ్ బేడీ(85) కన్నుమూశారు. వయోభారంతో సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా గుట్టూరు గ్రామంలోని తన కార్యాలయంలో తుదిశ్వాస విడిచారు.



నరేంద్ర సింగ్ బేడీ(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పెనుకొండ

పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన నరేంద్ర సింగ్ బేడీ యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారు. గత 55 ఏళ్లుగా అనేక ప్రజాహిత, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనుబంధంగా వ్యవసాయ కూలీల యూనియన్లను ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీల కోసం ఉద్యమాలు చేశారు. నిరుపేదలకు లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పంచడమే కాకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన సంక్షేమ పథకాల కోసం పోరాడారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా పేదలను చైతన్య పరచడం, వికలాంగులకు ప్రత్యేకమైన నిధులను సమకూర్చి వారికి కావాల్సిన కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళా సాధికారత కోసం మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, ఆర్థిక రాజకీయంగా చైతన్యవంతులు చేశారు. నిరుపేదలను స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయించి నాయకులను చేశారు. చేతివృత్తులు, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ వ్యాప్తంగా కూడా యంగ్ ఇండియా సేవలను కొనసాగించారు.

'ఉపాధి' అమలులో కీలకపాత్ర


వామపక్షాల మద్దతుతో యుపిఎ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో బేడీ కీలకపాత్ర పోషించారు. ఉపాధి అమలు కోసం అప్పటి కేంద్ర మంత్రి వెంకటస్వామిని అనంతపురానికి పిలిపించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌తో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు జరిగితే నిరుపేదలకు జరిగే ఉపయోగాలను క్షుణ్ణంగా వివరించి పథకం దేశవ్యాప్తంగా అమలు చేసేలా బేడీ కృషి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతుల సంక్షేమం కోసం బోరుబావులను తవ్వించి వారికి చేయూతను అందించారు.

పలువురు సంతాపం... నేడు అంత్యక్రియలు..

యంగ్ ఇండియా వ్యవస్థాపకుడు నరేంద్ర సింగ్ బేడీ మృతిపై పలువురు సంతాపం తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసిన వందలాది మంది బేడి మరణ వార్త విని కన్నీరుమున్నీరు అయ్యారు. పలువురు ఆయన మతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. మంగళవారం నాడు బేడి అంత్యక్రియలను గుట్టూరులోని యంగ్ ఇండియా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సిపిఎం నివాళి

అనంతపురం కలెక్టరేట్ : యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపశిల్పి నరేంద్ర సింగ్ బేడీ మతిపై సిపిఎం నివాళి అర్పించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ప్రకటన విడుదల చేశారు. పేదలు, అణగారిన వర్గాల కోసం విశేష కషి చేసిన బేడీ జీవితం స్ఫూర్తినీయం అన్నారు. వామపక్షాల మద్దతుతో యుపిఎ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. 50 సంవత్సరాల కిందట జిల్లాలో ఆయన ప్రారంభించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు పేదలకు ఎంతగానో తోడ్పడ్డాయని తెలిపారు. కరువు, రైతు ఆత్మహత్యలు, వలసలు జిల్లా గ్రామీణ జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తున్నప్పుడు అనేక సంస్థలతో కలిసి వారికి తోడుగా బేడీ నిలిచారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి దూరం అవడం జిల్లాకు తీరని లోటన్నారు.



అనంత భూములపై కార్పొరేట్ కన్ను పడింది. వేలాది ఎకరాల భూములను వాటికి కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ఇది వరకే సుముఖత వ్యక్తం చేశాయి. ఈ భూముల్లో పరిశ్రమలొస్తే ఉపాధి లభిస్తుందనుకుంటే పొరబాటే... ఉమ్మడి అనంతపురం జిల్లాలో వస్తున్నవి ఎక్కువ శాతం ఉపాధి రహిత పెట్టుబడులే కావడం గమనార్హం. జిల్లాలో వస్తున్నవి అత్యధికంగా గాలి, సోలార్ విద్యుత్ ఉత్పాదక పరిశ్రమలే ఉన్నాయి.

'అనంత భూములపై.. కార్పొరేట్ కన్ను..!

◆ సోలార్, విండ్‌కు వేలాది ఎకరాలు

◆ 20 వేల ఎకరాలకుపైగా ధారాదత్తం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు అనుమతులు పొందిన వరకే సుమారు 20 వేల ఎకరాల వరకు భూములను ఆయా కంపెనీలకు కట్టబెడుతున్నారు. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలో 1050 మెగావాట్లు, సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి, రాప్తాడు మండలాల పరిధిలో 1050 మెగావాట్లు, బొమ్మన హాల్, డి.హీరేహాల్ మండలాల పరిధిలో 850 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జెఎస్‌డబ్ల్యు నియో సంస్థకు ఈ భూములను కేటాయించారు. మెగావాట్‌కు ఆరు ఎకరాల చొప్పున మొత్తం 2950 మెగావాట్ల ఉత్పదానకు 17,700 ఎకరాలను ఈ మండలాల పరిధిలో సేకరించనున్నారు. ఇవి కాకుండా రాళ్ల అనంతపురం, కురబలహళ్లిలో మరో 400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. దీనికి 2400 ఎకరాలు సేకరించనున్నారు. తలుపుల మండలం పులిగుండ్ల గ్రామం పరిధిలో ఆక్వా గ్రీన్ సంస్థకు వెయ్యి మెగావాట్లకు ఏర్పాటు చేయనున్నారు. దీనికి ఆరు వేల ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ఇవి కాకుండా డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో ఆదానీ సంస్థకు పది వేల ఎకరాలు సేకరించాలన్న ప్రతిపాదన ఉంది. ఆ సంస్థ ప్రతినిధులు ఇది వరకే వచ్చి భూముల పరిశీలన జరిపారు. మొత్తం 30 వేల ఎకరాల వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికున్న ప్రతిపాదనలున్నాయి. ఇవి కాకుండా పారిశ్రామికవాడల పేరుతో సేకరించబోయే భూములు మురింత ఎక్కువగా ఉందని చెప్పవచ్చు.

రైతుకు శాశ్వత వలసలు తప్పవా..?

పరిశ్రమల పేరుతో సేకరిస్తున్న ఈ భూముల్లో ఉపాధి స్థానికంగా లభించే అవకాశాల్లేవు. విద్యుత్ ఉత్పాదక పరిశ్రమలతో ఉన్న భూములు కోల్పోయి స్థానికంగా పనుల్లేక రైతులు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఇప్పటికే గ్రామాల్లో ఉపాధి లేక నగరాలకు వలసలు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిశ్రమలు వస్తే శాశ్వత వలసలు వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యే అవకాశాలూ లేకపోలేదని పలువురు వాపోతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రభుత్వానికి నివేదిస్తాం

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి అందించే వినతులు, అభిప్రాయాలన్నింటినీ ప్రభుత్వానికి నివేదిస్తామని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. షెడ్యూలు కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ నిమిత్తం అనంతపురం జిల్లాలో సోమవారం ఆయన పర్యటించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు వి.వినోద్‌కుమార్, టిఎస్.చేతన్‌తో కలిసి వివిధ ప్రజసంఘాల నాయకులు, ఎస్సీ కులాల ప్రతినిధులతో అభిప్రాయాలు, వినతులను స్వీకరించారు. ఏకసభ్య కమిషన్‌కు షెడ్యూల్ కులాల వారి నుంచి 237 విజ్ఞాపనలు అందజేశారు. వినతులు స్వీకరణతో పాటు వారి అభిప్రాయాలు సైతం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ విన్నారు. వీటిని పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని కమిటీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి అందించే సమాచారంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి, పూర్తి సమాచారాన్ని సకాలంలో సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఆయా శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలకు అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఉపకులాల వారిగా సమాచారాన్ని అందించాలన్నారు. ఈ వివరాలు అన్నింటినీ ప్రభుత్వానికి అందిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో అనంతపురం ఎస్పీ వి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, అడిషనల్ ఎస్పీ డివి.రమణమూర్తి, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఈవో ప్రసాద్ బాబు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ సలీమ్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ జెడి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్యతో ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జెఈ వెంకటస్వామి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

జెవీఎస్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-హిందూపురం

సీనియర్ రాజకీయ నేత, హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ జెఇ.వెంకట స్వామి మృతి బాధ కలిగిస్తోందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విచారం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం బాలకృష్ణ జెఈ వెంకటస్వామి ఇంటికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరమర్శించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వెంకటస్వామి నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వెంకట స్వామికి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ ఛైర్మన్‌గా నియమించామన్నారు. ఆయన ఛైర్మన్‌గా ఉన్న కాలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఆయన హయాంలోనే పురం ప్రభుత్వాసుపత్రికి ఉత్తమ అవార్డులు కూడా దక్కాయన్నారు. ట్రస్టు ద్వారా విద్యాభివృద్ధి, పేదల సంక్షేమానికి కషి చేశారని కొనియాడారు. సాదు శెట్టి సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా వెంకటస్వామి కుమారులు జెవి.అనిల్ కుమార్, వేణుగోపాల్‌లు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని, వాటికి తన తోడ్పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

త్వరలోనే చెరువులు నింపుతాం : మంత్రి

ప్రజాశక్తి-సోమందేపల్లి

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను త్వరలోనే నీటితో నింపుతామని మంత్రి సవిత తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో అందిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు, పల్లె పండుగ, పొలం పిలుస్తోంది, తదితర కార్యక్రమాల పేరుతో ప్రజల వద్దకే అధికారులను పంపిస్తుందన్నారు. ఆరు నెలల్లోనే సీసీ రోడ్లు, డ్రెయిజీలు, గోకులం షెడ్లతో పాటు మరెన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. అనంతరం స్థానిక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్మాల్ కస్టర్ డెవలప్మెంట్ కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. చేనేత కార్మికులకు హుక్స్ జాకార్డ్ మోటార్‌తో కూడిన లిఫ్టింగ్ మిషన్, చేనేత పరికరాలు అందించారు. షిరిడీనగర్‌లో ఆక్రమణలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువల ఏర్పాటుపై జనసేన నాయకుడు గంగాధర్ వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనందరావు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

వ్యకాసం ఆధ్వర్యంలో వినతి

నియోజకవర్గ వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చారు. పెద్దన్న మాట్లాడుతూ పెత్తందారుల చేతుల్లో ఉన్న ప్రభుత భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలన్నారు. నాసిన్, బెల్, ఎయిర్ బస్ భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, సోమందేపల్లి, కోగిర, దేమకేతేపల్లి గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు కల్పించాలని, సోమందేపల్లి, పాల సముద్రం, పెనుకొండ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకొన్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, భూ నిర్వాసితులు నారాయణప్ప, వెంకట్రామి రెడ్డి, గంగమ్మ, సాగుదారులు అంబికా, శ్యామల, వరలక్ష్మి పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న వికలాంగురాలు

మునిమడుగు బాధితురాలికి మంత్రి పరామర్శ

ఇటీవల మునిమడుగు గ్రామంలో దాడికి గురైన వెంకటలక్ష్మిని మంత్రి సవిత పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘటన దురదృష్టకరం అన్నారు. నిందితులను వదిలే ప్రసక్తే లేదని, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుంద న్నారు. మంత్రి వెంట నాయకులు వెంకటరాముడు, కేశవయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, రమణమ్మ, లక్ష్మీదేవి ఉన్నారు.

కియా సెల్ఫీ స్పాట్ వద్ద సుందరీకరణ పనుల పరిశీలన

కియా కంపెనీ ఎదురుగా సెల్ఫీ స్పాట్ వద్ద సుందరీకరణ పనులను మంత్రి సవిత పరిశీలిం చారు. మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు దూరదృష్టితో కియా లాంటి అంతర్జాతీ పరిశ్రమను తీసుకు రావడంతో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో వేలాది ఎకరాలకు సాగు, ప్రజలకు తాగునీటి సమస్య తీరిందన్నారు. జాతీయ రహదారి కావడంతో ప్రయాణికులు కియా కంపెనీ వద్ద సెల్ఫీ తీసుకుంటారని, దీంతో సుందరీకరణ పనులు చేపట్టామని తెలిపారు.

వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక

గోరంట్ల : మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు పెనుకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంత్రి సవిత సమక్షంలో టిడిపిలో చేరారు. వైసిపి మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్పతో పాటు మలసముద్రం పంచాయతీకు చెందిన 27 వైసిపి కుటుంబాలుకు మంత్రి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. లక్ష్మీనరసప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరినట్లు తెలిపారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పచ్చ అశోక్, బాలకృష్ణచౌదరి, నరేష్, నిమ్మల శ్రీధర్, కృష్ణమూర్తి యాదవ్, అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సవిత సమక్షంలో టిడిపిలో చేరిన గోరంట్ల మండల వైసిపి నాయకులు

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కల్లుమర్రి పిహెచ్‌సి, బుల్లసముద్రం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డిఎంహెచ్ఓ మంజు వాణి తనిఖీ చేశారు. ఆమె కుష్టు వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, నివారణ మందుల గురించి ప్రజలకు వివరించారు. ఆమెతో పాటు వైద్యాధికారి డాక్టర్ మాధుర్య, ఎఎన్ఎం శశికళ, సూపర్వైజర్ సరస్వతి, ఆశ, నాగరత్నమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి-పెనుకొండ

బాల్య వివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తామని సమతా సొసైటీ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్, అసోసియేషన్ ఆఫ్ వాలంటరీ యాక్షన్ సంస్థలు సంయుక్తంగా పేర్కొన్నాయి. సమతా అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 12 రాష్ట్రాల్లోని 73 జిల్లాల్లో పిల్లల విద్య, సాధికారత, రక్షణ కోసం నీతి ఆయోగ్ ఎవిఎతో సహకరిస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించడానికి, సంఘాలను సమీకరించడానికి భాగస్వామ్యం చేస్తామన్నారు. బాలల హక్కులు, పిల్లల రక్షణ కోసం శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో సమతా సొసైటీ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ పని చేస్తోందన్నారు.

బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని సిడిపిఒ శాంతలక్ష్మి, ఎంపిడిఒ నరేష్‌కృష్ణ తెలిపారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని గ్రామ, వార్డు స్థాయి బాల్య వివాహ నియంత్రణ ఉద్యోగులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని మండలంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు సహకారించాలన్నారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు పుష్ప, ఎర్రమ్మ, సెక్రటరీలు, వీఆర్వోలు, హాజరయ్యారు.



సమతా స్వచ్ఛంద సంస్థ, నీతి అయోగ్ ప్రతినిధులు



వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-గుడిబండ

వాల్మీకులు అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని హిరేతుర్పి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి గుండుమల తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాల్మీకులు తమ పిల్లలను బాగా చదివించినప్పుడే వారి అభివృద్ధి సాధ్యమవుతుం దన్నారు. ప్రతి ఇంటిలో తమ పిల్లలను విద్యావంతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజు నాథ్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, నాయకులు లక్ష్మీనరసప్ప, భీమరాజు, చిత్తప్ప, రవిస్వామి, కరియన్న, బూదిపల్లి జయరామ్, మాజీ సర్పంచి శ్రీనాథ్, దాసప్ప, నాగరాజు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ బాధితునికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని టిడి పల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సోమవారం రూ. 25వేలను స్థానిక టిడిపి నాయకుల చేత చంద్రప్ప కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే చంద్రప్ప ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి అతడికి సిఎం సహాయ నిధి ద్వారా వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పెనుకొండలో భారీ చోరీ

ఉపాధ్యాయుల ఇంట్లో 47 తులాల బంగారం, రూ. లక్ష నగదు దోపిడీ

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో సోమవారం దొంగలు పట్టపగలే తాళం వేసిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. నాగార్జున, జ్యోతిలత దంపతులు ఇద్దరూ ఉపాధ్యాయులే. నాగార్జున గుట్టూరు హైస్కూల్‌లో, జ్యోతిలత పెనుకొండ బాలికల హైస్కూల్‌లో పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఉదయం ఇద్దరూ ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులకు వేసిన తాళాలను పగులుగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన 47 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష నగదు ఎత్తుకెళ్లారు. పాఠశాల ముగిసిన తర్వాత వచ్చిన ఉపాధ్యాయ దంపతులు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సిఐ రాఘవన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి సమాచారం సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో పట్టపగలే భారీ చోరీ జరగడం చర్చనీయాంశమైంది.

రహదారి నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-గోరంట్ల

ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సిఐ బోయ శేఖర్, తహశీల్దార్ మారుతి సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం సిఐ శేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఎపిఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది కళాశాల నుంచి బస్టాండ్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిఐ, తహశీల్దార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం తాగి, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమా దాలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



హెల్మెట్ వాడకంపై సిఐ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

నేడు 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఉదయం 11 గంటలకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ నివేదిత తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎంఎఒ, ఎడిఎ హాజరవుతారని తెలిపారు. సంబంధిత సిబ్బంది పాల్గొనాలన్నారు.

బెల్లాలచెరువులో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం పంచాయతీ బెల్లాలచెరువు గ్రామంలో సోమవారం పశు వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా పశువులు, గొర్రెలు, మేకలకు టీకా వేశారు. వైద్యులు మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులు, గొర్రెలు, మేకలకు సకాలంలో టీకా వేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో రాష్ట్ర వాల్మీకి సాధికారిక సభ్యులు చంద్ర, మనోహర్, జయచంద్రా రెడ్డి, గంగా ధర్, అంజనప్ప, వెంకట రమణ, వైద్య సిబ్బంది యశ్వంత్, శ్రీనివాసులు, భాను పాల్గొన్నారు



వైద్య శిబిరంలో పాల్గొన్న పశువైద్యులు, టిడిపి నాయకులు

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని బండ్లపల్లికి చెందిన బాధితులను స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సోమవారం పరామర్శించారు. బండ్లపల్లి పంచాయతీలోని నారాయణపురం గ్రామానికి చెందిన దేవినేని చిరంజీవి భార్య దేవినేని రాజేశ్వరి అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాధితులను సోమవారం పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో కుంటిమద్ది లోకేష్ అనారోగ్యంతో 20 రోజుల క్రితం మృతిచెందాడు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బండ్లపల్లి కిష్టప్ప, కేసప్ప, బైరాపురం సర్పంచి రవి, మాజీ ఎంపీటీసీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరం

ప్రజాశక్తి - బత్తలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు, గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్,బత్తలపల్లి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, పశు వైద్యాధికారి డాక్టర్ గుర్నాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లి, ఈదుల ముష్టూరు గ్రామాలలో పశు వైద్యాధికారులు ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో 55 పశువులకు సాధారణ పరీక్షలు చేసి వైద్యం చేశారు. 22 పాడి పశువులకు గర్భకోశ చికిత్స లు,5 ఆవులకు కృత్రిమగర్భధారణ,253 పశువులకు,6453 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సురేష్ నాయక్, పశువైద్య సహాయకులు, గోపాలమిత్రలు, పాడిరైతులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని సోమయాజులపల్లి కమతంపల్లి గ్రామాలలో సోమవారం పశువైద్య శిబిరాలను పశువైద్యాధికారి డి చెన్నకేశవ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దాదాపు 320 పశువులకు గొర్రెలకు పరీక్షలు నిర్వహించి పశువుల యజమానులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, ఎంపిటిసి జయరామ్, కృష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రామానుజన్ రెడ్డి, ఎస్ కేశవరెడ్డి, చంద్రశేఖర్, రమణారెడ్డి, పశువైద్య సిబ్బంది సాయికుమార్ నాయక్, పశువుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని గాండ్లవారిపల్లిలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని తెలుగుదేశం క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ నాయుడు సోమవారం ప్రారంభించారు. ధర్మవరం ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వీరభద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పాడి పశువులు, గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ మందులు, గొర్రెలలో బొబ్బ వ్యాధికి టీకాలను ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. ఈనెల 31 వరకు ప్రతి గ్రామంలోనూ పశువైద్య సిబ్బంది శిబిరాలను ఏర్పాటు చేస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామేశ్వర రావు, గ్రామ సర్పంచి సూర్యనారాయణ, మండల టిడిపి బూత్ కన్వీనర్ పి. బాలరాజు, నారాయణస్వామి, కూటమి నాయకులు, పశు వైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లికి చెందిన కందిపొలాల్లో అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు అక్కమ్మ, కళావతి, గంగన్న, హరిప్రసాద్ సాగుచేసిన కంది పంటలో ఏవో ఓబిరెడ్డి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో అధికారులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్లు మంజునాథ్, హుస్సేన్ పీరా, చాంద్ బాషా పలువురు రైతులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ ఎన్జీవోలకు అప్పగించండి

ప్రజాశక్తి - నల్లచెరువు

జిల్లావ్యాప్తంగా ఉన్న అడవుల సంరక్షణను ఎన్జీవోలకు ఇవ్వాలని పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయకుండా లక్షల మహా వృక్షాలను వేల ఎకరాల అడవులను అగ్నికి ఆహుతి కాకుండా కాపాడుతున్న సంస్థలను గుర్తించి నిధులు కేటాయించి అడవుల సంరక్షణకు బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్‌ను కోరారు.

రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని సోమయాజులపల్లిలో రీ సర్వేను సోమవారం ప్రారంభించినట్లు తహశీల్దార్ బాబురావు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూమి రీస్ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు రైతులు భూములు కొలతలేసి హద్దులు ఏర్పాటు చేసి రైతులకు అప్పగిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్ చక్రవర్తి, వీఆర్వోలు అమానుల్లా చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ జయ రామకృష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రామాంజులు రెడ్డి, చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డు పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలంలో అన్నాక్యాంటిన్ ఏర్పాటుకు స్థలాన్ని రెవిన్యూ సిబ్బంది టిడిపి నాయకులు పరిశీలించారు 30 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, వీఆర్వో నవీన్, సర్వేయర్ సందీప్ రెడ్డి ,వీఆర్ఏ ప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ మంజుల, నాయకులు సురేంద్ర, అబ్దుల్లా, ఆనంద్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూములు ప్రైవేట్ వ్యక్తుల కబంధహస్తాలలోకి పోకుండా తకు చర్యలు తీసుకోవాలనానరు. ప్రభుత్వ భూములు లేవంటూనే బడా బాబులు దర్జాగా ఆక్రమించుకుంటుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. భూ కబ్జాలపై సమగ్ర విచారణ జలపారన్నారు. పత్రికలు, మీడియాలో వస్తున్న కథనాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అలాగే జిల్లా కేంద్రమైన పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణ లేకపోవడంతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. పుట్టపర్తికి వచ్చే రహదారులలో పలుచోట్ల కంపచెట్లు పెరగడంతో వాహనదారులు మలుపుల వద్ద ప్రమాదానికి గురవుతున్నారని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఇఎస్ వెంకటేష్

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



జేసీకి సమస్యను విన్నవిస్తున్న బాధితుడు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను జెసి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీతో పాటు డిఆర్ఓ విజయసారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిఆర్‌వో సువర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి అధికారులతో మాట్లాడుతూ ఎన్నో ప్రయాసాలకు ఓర్చి జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి జిల్లా కేంద్రానికి వస్తారన్నారు. ప్రజలకు సరైన సమాధానం ఇచ్చి వారి సంతృప్తి పడే విధంగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కరించిన తరువాతనే అర్జీని డిస్పోస్ చేయాలన్నారు.కోర్టు కేసులు ఉన్న సమస్యలను పరిశీలించి కోర్టు ఆదేశాలను అమలుపరచాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, పట్టు పరిశ్రమల జేడి పద్మమ్మ, ఏపీఎంఐపీ సుదర్శన్, సిపిఒ విజయకుమార్, హౌసింగ్ పీడీ వెంకటరమణారెడ్డి, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతి, హార్టికల్చర్ ఏడీ చంద్రశేఖర్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లపై అదనంగా డబ్బు వసూలు చేస్తే చర్యలు : రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఏడాదికి మూడు సిలిండర్లు పేదలకు ఉచితంగా ఇస్తోందని, సిలిండర్లపై అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉచితంగా అందజేసే సిలిండర్‌కు రుసుం చెల్లించిన మూడు రోజులకే వినియోగదారుల ఖాతాలో డబ్బులు జమ అవుతుందన్నారు. దీపం 2 ఉచిత గ్యాస్ క్రింద చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా 80 నుండి 100 రూపాయల వరకు ఏజెన్సీ డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ఫిర్యాదులు తమ దష్టికి వస్తే సదరు ఏజెన్సీ పై తగు చర్యలు తీసుకుంటామని అవసరమైతే బ్లాక్ లిస్టులో పెట్టడమే గాక ఆ ఏజెన్సీ లైసెన్స్ ను రద్దు చేస్తామని హెచ్చరించారు. వార్త ఏజెన్సీలకు అదనంగా చెల్లించవద్దని జెసి వినియోగదారులకు సూచించారు. అదనంగా డబ్బు వసూలు చేస్తే 9959011237 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరేట్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై నిర్లక్ష్యం తగదు

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం
నిధులు వెనక్కు వెళ్లడంపై అసహనం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్


పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి అభివద్ధికి వినియోగించుకుండా సుమారు రూ.5 కోట్ల నిధులు వెనక్కి వెళ్లడంతో పుట్టపర్తి మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి మునిసిపాలిటీ అభివృద్ధిపై సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి తగిన ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు., పుట్టపర్తి మున్సిపాలిటీలో సుమారు రూ. 10 కోట్లకు పైగా ఆస్తి ,ఇంటి, నీటి పన్నుల బకాయి ఉన్నప్పటికీ అధికారులు కార్యాలయం లో కూర్చొంటే ఎలా వసూళ్లు అవుతాయని ప్రశ్నించారు. ప్రజల సొమ్ముతో మనం వేతనం తీసుకొని ప్రజల కోసం పని చేయకపోతే సమాజం ఊరుకోదని హెచ్చరించారు. ఇకపై మున్సిపల్ అధికారులు ప్రభుత్వానికి ప్రజల నుంచి రావాల్సిన అన్ని పన్నుల వసూళ్లపై దృష్టి సారించి పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కేంద్రం నుంచి వచ్చిన రూ.10 కోట్లు స్వచ్ఛ భారత్ నిధులు ఖర్చు చేయకపోవడంతో వాటిని అప్పటి ప్రభుత్వం ఇతర వాటికి ఖర్చు పెట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ మధ్య కాలంలో తిరిగి రూ.5కోట్లు సకాలంలో ఖర్చు చేయకపోవడంతో పాటు మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వల్ల అవి వెనక్కి వెళ్లాయని అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి రూ.5 కోట్లు ఆదాయం రావాల్సి ఉందని ఎందుకు వాటిపై దృష్టి సారించడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అధికారులకు పాలనపై ఏ మాత్రం పట్టు లేకపోతే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఆస్తులు ప్రజల ఆస్తి అని వాటిని రక్షించాలని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటవి పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులను హెచ్చరించారు. శిల్పారామం కాలనీలో రూ. 40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా పుట్టపర్తి పడమర గేట్ వద్ద గుంతలమయం అయిన రోడ్డును రూ.40 లక్షల పుడా నిధులతో నిర్మాణం చేయాలని చెప్పారు. పట్టణంలో డ్రైనేజీ సమస్య, త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాదకు సూచించారు. సత్యమ్మ గుడి వద్ద వర్షపు నీళ్లు నిల్వ లేకుండా చూడాలని కోరారు. పుట్టపర్తి లో అనధికార నిర్మాణ కట్టడాలు, లేఅవుట్ల యజమానులకు నోటీసులు జారీ చేసి అధికారికంగా వాటిని క్రమబద్ధీకరణ చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద,మున్సిపల్ డీఈ నరసింహ మూర్తి, పుడా అధికారులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి వాసికి అరుదైన గుర్తింపు

26న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు

ప్రజాశక్తి - కదిరి టౌన్

తమిళనాడులోని మధురైలో ఉన్న ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తున్న కదిరి వాసి మంగు హనుమంతురావుకి అరుదైన గుర్తింపు లభించింది. వైద్య విభాగంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ఆయన విశిష్ట సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈనెల 26న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేయనుంది. ఈ వేడుకలకు భారత దేశంలోని పలుప్రాంతాల నుండి 15 మంది ఆహ్వానింపబడగా అందులో ఒకరిగా దక్షిణ భారత దేశం నుండి హనుమంత రావు ఎంపికయ్యారు. ఆయన వైద్యవిద్యలో కర్నూలు వైద్యకళాశాల నుండి పట్టభద్రులైనారు. మనిపాల్ కస్తురిబా వైద్య కళాశాల లో అనెస్థీసియా లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 30 సంవత్సరాలపాటు తిరుపతి స్విమ్స్‌లో డైరెక్టర్‌గా సేవలు అందించారు. కదిరికి చెందిన హనుమంతరావుకి అరుదైన గౌరవం లభించడంతో ఇక్కడి ప్రజలు నుండి హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



అవార్డుకు ఎంపికైన హనుమంతరావు

ఢిల్లీ రిపబ్లిక్‌డేకు ధర్మవరం కళాకారిణి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఈనెల 26న ఢిల్లీలో నిర్వహించబడే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనడానికి ధర్మవరం పట్టణానికి చెందిన జానపద కళాకారిణి సోమిశెట్టి సరళ ఎంపికైంది. ఈసందర్భంగా కళాకారిణి మాట్లాడుతూ తాను రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. తన బృందంతో కలిసి ప్రదర్శన ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఢిల్లీలో రిహార్సల్స్ చేస్తున్నామని చెప్పారు. ఈనెల 24న గిన్నిస్ బుక్ నిర్వాహకుల సమక్షంలో ఈ ప్రదర్శన ఇస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 22 జానపద కళారూపాలు, 29 గిరిజన కళారూపాలతో కలిపి 5000 మంది కళాకారులతో ఒక పెద్ద కళా ప్రదర్శన ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముందు ప్రదర్శన ఇవ్వనున్నట్లు వివరించారు. ధర్మవరం జానపద కళాకారిణి రిపబ్లిక్ డేకు ఎంపిక కావడం పట్ల కళాకారులు, మిత్రులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



కళాకారిణి సోమిశెట్టి సరళ

పిఎం ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధానమంత్రి ఇంటర్‌షిప్ పోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సాయిమనోహర్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి ఇంటర్‌షిప్ వల్ల పలు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భారతదేశంలోని అగ్రశ్రేణికంపెనీలలో 12 నెలల పరిశ్రమల అనుభవము, భారత ప్రభుత్వం ద్వారా నెలవారి సహాయం రూ.4,500, పరిశ్రమల ద్వారా 500 రూపాయలు ఉంటుందని తెలిపారు. ఇంటర్‌షిప్‌రిజిస్ట్రేషన్ ఈనెల 10న ప్రారంభమై 21వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ఈ ఇంటర్‌షిప్ పోగ్రాంనకు గ్రామీణ నిరుద్యోగులు 21 నుండి 24 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు అర్హులని చెప్పారు.

వేళకు రాని గ్రామ సచివాలయ సిబ్బంది

ఉదయం 11 గంటలైనా తెరవని సచివాలయం
ఇబ్బందుల్లో గ్రామస్తులు
సిబ్బందికి మెమోలు



సచివాలయం బయట వేచి ఉన్న ప్రజలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని తంబాపురం గ్రామ సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. సోమవారం విధులకు ఆలస్యంగా హాజరయ్యారు. సమయపాలన పాటించని సిబ్బందిపై ఎంపీడీవో అధికారులు మెమోలు జారీ చేశారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామసచివాలయంలోని సిబ్బంది విధినిర్వహణ పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఉదయం 10 గంటలకే సచివాలయం వద్దకు చేరుకున్నారు. అయితే సిబ్బంది మాత్రం రాలేదు. 11 గంటలు అవుతున్నా సచివాలయం తలుపులు తెరవకపోవడంతో వచ్చిన వారు ఫోటోలు తీసి ఎంపీడీవో కార్యాలయానికి షేర్ చేశారు. దీంతో స్పందించిన ఎంపీడీవో కార్యాలయ అధికారులు విషయం ఆరా తీశారు. సచివాలయం తలుపులు తెరవలేదని తెలుసుకుని వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చి కార్యాలయ తలుపులు తెరిపించారు. అయినా సిబ్బంది రాకపోవడంతో అక్కడున్న వారికి ఏమి చేయాలో పాలు పోవడంలేదు. దీంతో ప్రజలు నిరాశతో వెనుతిరిగారు. సచివాలయాలను అధికారులు తనిఖీలు చేయకపోవటంతోనే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో కార్యాలయ ఏవో శ్రీనివాసులు మాట్లాడుతూ తంబాపురం సచివాలయంలో పది మంది సిబ్బంది ఉన్నారని, వారందరికీ చార్జ్ మెమో ఇచ్చామని చెప్పారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. సచివాలయ సిబ్బంది ఇచ్చే వివరణతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాల ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు.

2500 ట్రాక్టర్ల ఇసుక సీజ్

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధిలోని మర్రికొమ్మ దిన్నె గ్రామ శివార్లలో డంప్ చేసిన 2500 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి పెద్దిరెడ్డి, తహశీల్దార్ దేవేందర్ నాయక్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు. గ్రామ శివార్లలో రెండు చోట్ల ఇసుకను నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. ఒకచోట 1500 ట్రాక్టర్ల ఇసుక, మరో చోట వెయ్యి ట్రాక్టర్ల ఇసుకను గుర్తించామన్నారు. అదే గ్రామానికి చెందిన చల్లబయా రెడ్డి చెందిన సర్వేనంబర్ 485లోని ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇసుకను డంప్ చేశారన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన నాగేశ్వరావు అంటే వ్యక్తికి చల్లా బయ్యారెడ్డి తన భూమిని లీజు ఇచ్చినట్లు రైతు చెప్పాడన్నారు. ఇసుక విలువ దాదాపు 50 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. ఈ కార్యక్రమలో వీఆర్వోలు రఘునాథ్, అనుపమ తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండలంలో గంజాయి విక్రయిస్తున్న 9మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వలిసాబ్ తెలిపారు. సోమవారం తమకు వచ్చిన సమాచారం మేరకు కొత్త రోడ్డు వద్ద గంజాయిని విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కదిరి డీఎస్పీ ఎదుట హాజరపరచమని తెలిపారు.

హత్యకేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

తమ వివాహేతర సంబంధానికి అడ్డు ఉన్నాడంటూ ప్రియుడితో కలిసి ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో భర్తని గొంతు నులిమి చంపిన హత్య చేసిన సంఘటనలో మృతుడి భార్యను, ఆమె ప్రియుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ అబ్దుల్ కరీం వివరించారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులను పూర్తి స్థాయిలో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి.రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ స్థానిక సబ్‌జైలును సోమవారం తనిఖీ చేశారు. తొలుత ఖైదీలు ఉండే గదులను, వంటగదిని పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం జైలు ఖైదీలతో వారు సమావేశాన్ని నిర్వహించారు. సబ్ జైల్లో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచితంగా లాయర్ల ఏర్పాటు ఉందని ఖైదీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా న్యాయ సహాయం కావాలనుకునే వారు కూడా తమకు తెలపాలన్నారు. సబ్ జైల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని జైలు సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, బాల సుందరి, పారా లీగల్ వాలంటీర్ షామీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తచెరువు మండల పరిధిలోని ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్, బస్టాండ్లో పోలీసులు సోమవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున జిల్లాలోని ప్రధాన రహదారులతో పాటు బస్టాండ్, దేవాలయ ఆవరణాలు ప్రధాన రహదారులలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. అంతేకాక రహదారులలో లారీలను ఆపి ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు వాహనాలను తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్లో అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు.

ప్రత్యేక న్యాయమూర్తిగా రమణయ్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రత్యేక న్యాయమూర్తిగా ఎస్. రమణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రత్యేక న్యాయమూర్తి ఉద్యోగ విరమణ చేయడంతో గత నాలుగేళ్లుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఖాళీగా ఉన్న ప్రత్యేక న్యాయమూర్తి పోస్టులను భర్తీ చేయడంతో రమణయ్యను హిందూపురం ప్రత్యేక న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఇందులో భాగంగా స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అదే విధంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ప్రత్యేక న్యాయమూర్తిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రమణయ్య గతంలో హిందూపురం మెజిస్ట్రేట్ గా, ఇంచార్జ్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేయడంతో పాటు అనంతపురం కార్మిక న్యాయస్థానం జడ్జిగా పనిచేస్తూ జిల్లా జడ్జిస్థాయిలో ఉద్యోగ విరమణ చేశారు. అనేక ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టు భర్తీ కావడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

గుండె పోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బోయపేటకు చెందిన అంగన్వాడీకార్యకర్త లక్ష్మీదేవమ్మ సోమవారం తెల్లవారు జాముల గుండె పోటుతో మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు పట్టణ కన్వీనర్ విఆర్ రాము, ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, అధ్యక్షులు అరుణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మట్టి ఖర్చులకు పైసా విదిల్చని ప్రభుత్వాలు: అంగన్వాడీలు మృతిచెందితే వారి మట్టిఖర్చులకు ప్రభుత్వాలు పైసా కూడా ఇవ్వటం లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి విమర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వావాడి కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, కార్యకర్తలు చిన్నారులకు అక్షర జ్ఞానాన్ని నేర్పిస్తు గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సూచనలు ఇస్తు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు తీసుకోస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి అన్ని సర్వేలు చేస్తు సేవలను అందిస్తున్నారన్నారు. వారిలో ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి ప్రభుత్వలు పైసా సైతం నిధులు విదల్చడం లేదని విమర్శించారు. ఐసిడిఎస్ లో విధులు నిర్వహిస్తు ఆరు నెలల కాల వ్యవదిలో నలగురు అంగన్వాడీ కార్యకర్తలు మృతి చెందారన్నారు. వీరందరికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఒక్క పైసా సహాయం అందలేదన్నారు. అంగన్వాడీలు ఉన్నంత కాలం రకరకాల పనులతో పాటు వివిధ యాప్ ల పేరుతో వెట్టి చాకిరీ చేయిస్తూ వేదిస్తున్న ప్రభుత్వాలు అంగన్వాడీలు మృతి చెందితే కనీసం మట్టి ఖర్చులకు సైతం పైసా ఇవ్వడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు సైతం మృత దేహం వద్దకు వచ్చి నివాళులు అర్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వాలు స్పందించి మృతి చెందిన అంగన్వాడీ కుటుంబాలకు అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ లీడర్స్ శైలమ్మ, నాగమ్మ, శిరీష, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలేయ మార్పిడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని నేసే పేటకు చెందిన కొత్త అనిల్ కుమార్, కొత్త అనితల కుమార్తె 3సంవత్సరాల నిహాన్వి పుట్టుకతోనే కాలేయ సమస్యతో బాధపడుతోంది. వైద్యుల సలహా మేరకు కాలేయ మార్పిడి చేయించాల్సి ఉండగా అందుకోసం తగినంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను బాధితులు ఆశ్రయించారు. హైదరాబాదులోని గ్లెన్‌ఈగల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారి కాలేయ మార్పిడి ఆపరేషన్ కోసం మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వెంటనే రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్‌తో పాటు మంత్రి లేఖను మంత్రిగారి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు సోమవారం ఆ చిన్నారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డోలా రాజారెడ్డి, ఎర్రజోడు లోకేష్, జుటూరు వెంకటేష్, పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్, సాకే ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముదిగుబ్బ : మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు మంజూరైన సిసి రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ , క్లస్టర్ ఇన్చార్జి తుమ్మల మనోహర్ , రమేష్ బాబు , కోట్ల బాబి , తుమ్మల సూరి ,సోముల ప్రకాష్ నాయుడు, సర్పంచి కత్తిం పాపయ్య పాల్గొన్నారు.

25న సర్వసభ్య సమావేశం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న శనివారం ఎంపిపి సి.పెద్దన్న అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

పామిడి : మండల కేంద్రంలోని కొండూరు రోడ్డులో వెలిసిన అంకాళమ్మ, కుంటెమ్మ అమ్మవార్ల జాతర సందర్భంగా సోమవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉరుములు, వాయిద్యాల మధ్య ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా ఫల పుష్పాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు : ఎమ్మెల్యే



గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధూర రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు సాధ్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. బుక్కపట్నంలోని మహాత్మ జ్యోతిబా పూలే బిసి సంక్షేమ బాలికల వసతి పాఠశాలకు ప్రభుత్వం నుంచి తగినంత నిధులు తీసుకొచ్చి వాటిని అతి త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి నూతన గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామనితెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యాసంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే ప్రతి మనిషికి తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. విద్యార్థులు సంక్షేమం కోసం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విరాళం అందించిన రూ. 50 వేల రూపాయల విలువచేసే ఫ్యాన్లు, ప్రజెక్టర్, ఇన్వర్టర్‌ను మహాత్మ జ్యోతి బా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు పిసి గంగన్న, బెస్త చలపతి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ ఛైర్మన్‌కు వినతుల వెల్లువ



వినతిని అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

శింగనమల : ఎస్‌సి రిజర్వేషన్ శాతంలో ఉపకులాలకు సమన్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి నాయకులు బండారు కుళ్లాయప్ప కోరారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ భవన్‌లో ఎస్‌సి వర్గీకరణ అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో దాదాపు 8వేల పైచిలుకు ఎస్సీ జనాభా ఉందన్నారు. ఇందులో 90 శాతం మాదిగ సామజికవర్గానికి చెందిన వారు ఉన్నారన్నారు. వీరందరూ ఉమ్మడి రిజర్వేషన్ విధానం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్‌సి 59 ఉపకులాలకు సమన్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హెచ్.లింగమయ్య, తిరుపతయ్య, ఆంజనేయులు, వెంకటేశు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్ర స్థాయి జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పిఎస్, డిజిహెచ్‌ఎస్‌ఎస్ నాయకులు కోరారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ భవన్‌లో ఎస్‌సి వర్గీకరణ అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాను ఎంఆర్‌పిఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో డిజిహెచ్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు మీనుగ గోపాల్, రాష్ట్ర అధ్యక్షులు సాకే రమేష్, జిల్లా అధికార ప్రతినిధి సోముశేఖర్, కూడేరు లక్ష్మన్న, రాజు, రామాంజినేయులు, ముత్యాలు, లక్ష్మీనారాయణ, రాజు, కందేపల్లి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలందరూ సమానమే

ప్రజాశక్తి-హిందూపురం

వివిధ తప్పులు చేసి కారాగారాలకు వచ్చే ఖైదీలందరూ అధికార దృష్టిలో ఒక్కటేనని జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఖైదీల నడుమ ఎలాంటి కులవివక్షకు తావు లేదని ఆయన చెప్పారు. సోమవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపకారాగారంలో కుల వివక్షకు ఏ మాత్రం తావు లేదన్నారు. అలా ఎక్కడైనా వివక్ష చూపుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనారోగ్యాలకు గురైన ఖైదీల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. అదే విధంగా 18 ఏళ్ల లోపు, 70 ఏళ్ళు పైబడిన నిందితులు ఎవరైనా జైలులో ఉన్న సంబంధిత జైలు అధికారి తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాది సంతోషి కుమారి, ఉపకారాగార అధికారి హనుమన్న, లోక్ అదాలకు సిబ్బంది హేమావతి, పారా లీగల్ వాలంటీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చూపులేని పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే రోటరీ క్లబ్ ధ్యేయమని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్తా, క్యాంపు ఛైర్మన్ విజయ్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకరా కంటి ఆసుపత్రి– బెంగళూరు, జిల్లా అందత్వ నివారణ సంస్థ అనంతపురం జిల్లా వారి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి దాతలుగా సింగం రెడ్డి వెంకట లక్ష్మమ్మ, సింగం రెడ్డి రామిరెడ్డి, వారి కుమారుడు సింగం రెడ్డి వెంకటరామిరెడ్డి కోడలు సింగం రెడ్డి మమత వ్యవహరించడం పట్ల నిర్వాహకులు వారిని సత్కరించారు. ఈ శిబిరంలో 98 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించగా 75 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ సత్రశాల ప్రసన్నకుమార్, అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, రామకృష్ణ, కొండయ్య, రమేష్, పెరుమాల దాస్ పాల్గొన్నారు.



దేహదాన పత్రాన్ని అందిస్తున్న డా॥మాణిక్యరావు

జర్నలిస్టులు సమాజ సేవకులు

ప్రజాశక్తి-అనంతపురం

జర్నలిస్టులు సమాజ సేవకులు అని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు కొనియాడారు. ఈనెల 7న మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు నందిని దేవప్రసాద్ (జెమిని ప్రసాద్) పార్థీవదేహాన్ని మెడికల్ కళాశాల వైద్య విద్యార్థుల శాస్త్ర విజ్ఞానం కోసం అందించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సోమవారం ఇందుకు సంబంధించిన దేహదాన ప్రశంసాపత్రాన్ని జర్నలిస్టులు చల్లా కెనాయుడు, ప్రజాశక్తి రవిచంద్రకు అందించారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుళ్తూ ఉంటారన్నారు. వారి సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

బ్రహ్మసముద్రం : మండలంలోని గుండిగానిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఏవో సరిత తెలిపారు. గ్రామానికి 25 టన్నుల యూరియా మంజూరైంది. 324 మందికి గానూ 130 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియాను రెండు రోజులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సౌమ్య, టిడిపి నాయకులు నాగిరెడ్డి, కేశవర్ధన్‌గౌడ్, బజ్జన్నగౌడ, తిప్పేస్వామి, భీమిరెడ్డి, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు

రాయదుర్గం : సచివాలయ ఉద్యోగులకు అన్యాయం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని బహుజన సమా జ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగుల్లో 90 శాతం బహుజనులే ఉన్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందే కానీ వారికి పూర్తి స్థాయిలో ఉద్యోగ భద్రత, భరో సా, ఉద్యోగోన్నతులకు సంబంధించి విధి విధానాలు ఏర్పాటు చేయకుండా గాలికి వదిలేసిందన్నారు. దీంత వారు నూతన ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుంటే వారికి అన్యాయం చేయాలని చూడడం దుర్మార్గ మన్నారు. రేషనలైజేషన్ పేరుతో మోసం చేయాలని చూస్తుందన్నారు. వాలంటీర్ వ్యవస్థను తీసివేసి వారి పనిని సెక్రటరీలతోనే చేయించడం వల్ల వారి పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల అభీష్టం మేరకు మాతృశాఖలో విలీనం చేయాలని, జిఒ–423 రద్దు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.

అనుష్టానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బ్రహ్మసముద్రం

శ్రీముమ్మడి శాంత లింగేశ్వరస్వామి అనుష్టానం చేసి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమ వారం మండలంలోని ముప్పలకుంట గ్రామంలో అనుష్టానోత్సవం నిర్వహించారు. కేదార్‌నాథ్ ఆలయ ఆస్థాన స్వామిజీ శ్రీనాల్వాడీ శాంతలింగేశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆ గ్రామం వెళ్లి నాల్వాడి శాంత లింగేశ్వరస్వామి ఆశీర్వాదం పొందారు. గ్రామంలో స్వామి వారి ఊరేగింపు, ధ్వజారోహణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు వెంకటేశులు, చిత్తప్ప ఉన్నారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- రాయదుర్గం రూరల్

పశువుల ఆరోగ్యం, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నివారణ, పశుపోషణ ఖర్చులను తగ్గించి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని మలకపురం, వడ్రహొన్నూరు గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా, దూడలకు నట్టల నివారణ మందు, గొర్రెలకు బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఎదకురాని పశువులు, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పశుపోషకుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో జుంజురాంపల్లి సర్పంచి వన్నూరు స్వామి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని మంగళకుంట, బోరంపల్లి గ్రామాల్లో డాక్టర్ మంజునాథ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు గాలికుంటు టీకా, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

రహదారి భద్రత మాసోత్సవాలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వాహనదారులకు రహదారి భద్రత పైన అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలకు సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ వరప్రసాద్, ఎఎంవిఐ రాజేష్, పట్నం పోలీసులు పాల్గొన్నారు.